సాక్షి
వికారాబాద్
బుధవారం ၊ 12 ၊ జూలై ၊ 2023





## అధిక దిగుబడులు

వరి సాగులో దిగుబడి పెరగాలంటే యాజమాన్య పద్ధతులు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



## పశువైద్యం.. అందని ద్రాక్షే..!

పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. 8లో▸



## ఈవీఎంలపై అవగాహన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీటీ మహేశ్ అన్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### మహాయాగంలో కౌశిక్‌రెడ్డి పూజలు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కలిసి యాగంలో పూజలు చేస్తున్న ప్రభుత్వవిప్ కౌశిక్‌రెడ్డి

**తాండూరు:** పట్టణంలో జరుగుతున్న రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర మహాయాగాలు తొమ్మిదో రోజైన మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి యాగాన్ని సందర్శించి, పూజల్లో పాల్గొన్నారు.

### ఉత్తమ పురస్కారానికి ఏఎస్‌ఐ ఎంపిక



ఏఎస్‌ఐ సత్యశీలారెడ్డి

**కుల్కచర్ల:** విధి నిర్వహణలో ఉత్తమ పని తీరు కనబర్చిన వారికి పోలీసు శాఖ అందించే ఉత్తమ సేవా పురస్కారానికి కుల్కచర్ల ఏఎస్‌ఐ సత్యశీలారెడ్డి ఎంపికయ్యారు. మంగళవారం రాష్ట్ర పోలీసు శాఖ అవార్డు గ్రహీతలుగా ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. త్వరలోనే ఈ పతకాలను అందించి సత్కరించనున్నారు.

### సమ్మేళనాలపై సమీక్ష



సమ్మేళనానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, నేతలు

**పరిగి:** పట్టణంలోని నజీరాబాద్‌తండాలో నవంబర్ 11, 12, 13 తేదీల్లో నిర్వహించే సమ్మేళనాలపై కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మైనార్టీ నాయకులతో కలసి సమీక్ష నిర్వహించారు. పలు కీలక అంశాలపై ముస్లింలతో చర్చించినట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల మైనార్టీలు హాజరు కావాలని సూచించారు. సుమారు 150 ఎకరాల్లో ఈ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం స్థల పరిశీలన చేసి సభకు అవసరమైన ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ, మైనార్టీ నేతలు మోయిజ్‌అలీ, తాహెర్ అలీ, సమీపటేల్, మౌలానా, మునీర్, హాజీపటేల్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారం సాధించే దిశగా సాగాలి



యువజన కాంగ్రెస్ పార్టీనాయకులకు నియామక పత్రాలు అందజేస్తున్న టీఆర్‌ఆర్

**పరిగి:** యూత్ కాంగ్రెస్ నాయకులు అధికారం సాధించే దిశగా ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని తన నివాసంలో యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన వారికి పదవులు వస్తాయన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

### మహిళా సంక్షేమానికి పెద్దపీట

**రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి**

**షాబాద్:** మహిళా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హైతాబాద్, పెద్దవేడు, నాన్‌ందార్‌ఖాన్ పేట్, లింగారెడ్డి గ్రామా ల్లో చేపట్టిన పల్లెప ల్లెకూ పట్నం అవినాశ్‌రెడ్డి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు.

# డబుల్ జాప్యం!



కుల్కచర్ల మండలం లింగంపల్లిలో నిర్మాణాలు పూర్తయి నాలుగేళ్లు దాటినా పేదలకు కేటాయించకపోవటంతో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు

**దరఖాస్తుల విచారణ పూర్తయి నెలలు..**

- రెండోసారి సైతం ముగిసిన స్క్రీనింగ్
- ఇళ్ల పంపిణీలో మీనమేషాలు
- ఎదురు చూపుల్లో లబ్ధిదారులు

**వికారాబాద్:** జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతుండగా పూర్తయిన.. ఇప్పటికే పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయడంలోనూ అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇందుకోసం ఏడాది కాలంగా కసరత్తు చేస్తున్న అధికారులు లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒక్కో చోట నిర్మాణాలు పూర్తయి నాలుగేళ్లు దాటింది. మరికొన్ని చోట్ల తుది మెరుగులు, చిన్నచిన్న పనులు మినహా నిర్మాణాలు పూర్తయ్యాయి. డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు పూర్తికావచ్చినా ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి పేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే కసరత్తు ప్రారంభించింది. నిర్మాణ పనులు పూర్తికావచ్చినా వీటిని మార్చి నెలాఖరులోగా పూర్తి చేయటంతో పాటు పేదలకు పంచేందుకు కసరత్తు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**దరఖాస్తుల విచారణ పూర్తి**

వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి అర్హులను గుర్తించేందుకు ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో ముగ్గురు చొప్పున టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ జాబితా పట్టుకుని ఆయా బృందాలు వార్డుల వారీగా ఇంటింటికి వెళ్లి ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు..? అనే కోణంలో విచారణ జరిపారు. వచ్చిన దరఖాస్తులను అందుబాటులోకి వచ్చిన ఇళ్లకు భారీ వ్యత్యాసం ఉంది. వచ్చిన దరఖాస్తుల్లో పదిశాతం లోపు ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు జరిపిన విచారణలో వచ్చిన దరఖాస్తుల్లో యాభై శాతం అర్హులు ఉన్నట్టు తేలింది. అర్హుల జాబితాను తగ్గించేందుకు మరోమారు విచారణ కూడా పూర్తి చేసిన అధికారులు నెలలు గడుస్తున్నా వీటిని పేదలకు పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా పేదలకు పంపిణీ చేయలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

**అందుబాటులో 1,031 ఇళ్లు**

జిల్లాలో 1,031 ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకోగా ముందుగా చిన్నచిన్న పనులు మినహా పూర్తి కావచ్చిన ఇళ్ల నిర్మాణ పనులపై అధికారులు దృష్టి సారించారు. తుది దశకు చేరిన ఇళ్లను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో కరెంటు, నీటి సౌకర్యం కల్పించడంతో పాటు రంగులు వేసి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతుండగా ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాకు ప్రభుత్వం మొదట్లో 5,740 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసింది. వీటికి సంబంధించి 2016లో వీటికి భూమి పూజ చేశారు. ఆ తర్వాత వీటి సంఖ్యను 3,800 కుదించారు. ప్రస్తుతం ఇందులో 2,257 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో 1,031 ఇళ్లు చిన్నచిన్న పనులు మినహా పూర్తి కావచ్చాయి. 1,543 ఇళ్లు ఇంకా ప్రారంభించలేదు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న ఇళ్లు మూడు వారాల్లో పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధారూరులో 120, మర్పల్లిలో 120, యాలాల మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 మొత్తం 1,031 ఇళ్లను పేదలకు అందించేందుకు అధికారులు, నేతలు సిద్ధమయ్యారు. ఇళ్లు పూర్తయిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించగా.. 12,205 మంది అర్జీ పెట్టుకున్నారు.

# ఓపెన్ ప్లాట్లకు భలే డిమాండ్

- అల్లాపూర్‌లోని 16 ఎకరాలకు వేలం
- రూ.2 కోట్లకుపైగా ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓలు

**తాండూరు రూరల్:** ఓపెన్ ప్లాట్లకు భలే డిమాండ్ వచ్చింది. మండల పరిధిలోని అల్లాపూర్ శివారు ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 109లో 27 ప్లాట్లు విభజించారు. అర ఎకరా నుంచి ఎకరా వరకు బిట్లు బిట్లుగా చేసి వేలం పాట నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆశావహులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఎకరాకు ప్రభుత్వ ధరను రూ.10 లక్షలుగా నిర్ణయించారు. సుమారు 50 మంది డీడీలు తీసుకుని వేలంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంచిత్ అగర్వాల్, ఆర్డీఓ అశోక్‌కుమార్, డీఏఓ సుధ, తహసీల్దార్ చిన్నప్పలనాయుడు, రాజీవ్ స్వగృహ అధికారులు పాల్గొన్నారు.

**రేపు వికారాబాద్‌లో ప్లాట్ల వేలం**

**వికారాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి సర్వే నంబర్ బిల్లా దాఖల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లే అవుట్‌లో గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఆర్డీఓ విజయ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 22 ప్లాట్లు సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిపారు. దీనికి ప్రభుత్వం కనీస ధర ఎకరానికి రూ.60 లక్షలు నిర్ణయించిందన్నారు. ప్లాట్ల వేలంలో పాల్గొనదల్చిన వారు ధరావత్తు కింద రూ.10 వేలు బ్యాంకు డీడీ తీసి వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. లే అవుట్ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఇందులో ఎలాంటి చిక్కులు, వివాదాలు లేవని తెలిపారు. ఈ స్థలాలను బహుళ ప్రయోజనాలకు ఉపయోగించుకోవచ్చని సూచించారు. వివరాలకు 7993455775, 9959965507 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



వేలంపాటలో పాల్గొన్న ఆశావహులు



డీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

# ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోంది

- పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

**పరిగి:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల శ్రమను దోచుకుంటోందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు రోడ్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు.పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికులు లేనిదే గ్రామాల్లో స్వచ్ఛత లేదని స్పష్టంచేశారు. కార్మికుల కష్టం, కృషితోనే ప్రస్తుతం పల్లెలు, ప్రజల ఆరోగ్యం బాగుందని వివరించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ మొండి వైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేదంటే, సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సీనియర్ నాయకుడు అశోక్, చిన్న నర్సింహులు, రాజపుల్లారెడ్డి, వెంకటేశ్, నాగవర్ధన్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి



అడిషనల్ కలెక్టర్ లింగానాయక్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ బుచ్చయ్య

- ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- అడిషనల్ కలెక్టర్ లింగానాయక్
- తహసీల్దార్లు, ఎలక్షన్ సిబ్బందితో సమావేశం

**కొడంగల్ రూరల్:** రాబోయే ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, గ్రామాల్లోని ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ లింగానాయక్ సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు, ఎలక్షన్ సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా వచ్చిన దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లను పర్యవేక్షిస్తూ అవసరమైన వసతుల కోసం కృషిచేయాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగానాయక్‌ను తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ బుచ్చయ్య, దౌల్తాబాద్ తహసీల్దార్ కృష్ణయ్య, దుద్యాల తహసీల్దార్ భీమయ్య, బొంరాస్‌పేట తహసీల్దార్ షర్మిల, కోస్గి తహసీల్దార్ మమత, గుండుమాల్ తహసీల్దార్ పాండునాయక్, మద్దూరు తహసీల్దార్ జయరాం, కొడంగల్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, ఎలక్షన్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'స్పోర్ట్స్' సెలెక్షన్స్

- క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్లకు అర్హుల ఎంపిక
- 13, 14న జిల్లా స్థాయి సెలెక్షన్స్
- వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో అర్హత పరీక్షలు
- సెలెక్టయిన వారికి 4,5వ తరగతుల్లో అడ్మిషన్లు



విద్యార్థుల ఎంపిక కోసం క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు

**వికారాబాద్ అర్బన్:** పాఠశాల స్థాయి నుంచే చిన్నారులను క్రీడల్లో మరింత ప్రోత్సహించి, మంచి శిక్షణ ఇచ్చి జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మూడు క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. వీటిలో అడ్మిషన్ పొందాలంటే మూడంచెల్లో పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మండల, జిల్లా స్థాయిలో ఆయా క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసి స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్చుకుంటారు. 4, 5 తరగతుల్లో ప్రవేశాలు తీసుకొని నాణ్యమైన విద్యాబోధనతో పాటు, విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో అత్యుత్తమ శిక్షణ ఇస్తారు. ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసిన చాలా మంది క్రీడాకారులు ఆయా క్రీడల్లో రాణించడంతో పాటు, స్పోర్ట్స్ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

**13, 14న జిల్లా స్థాయి ఎంపికలు**

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మూడు స్పోర్ట్స్ స్కూళ్లలో 4,5 తరగతుల్లో ప్రవేశాలకు సెలెక్షన్స్ కొనసాగుతున్నాయి.ఇప్పటికే మండల స్థాయిలో ఎంపిక పూర్తి కావడంతో ఈ నెల 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి సెలెక్షన్స్ నిర్వహించనున్నారు. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో ఎంపిక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారు.రాష్ట్ర స్థాయిలో మెరిట్ ఆధారంగా 4,5వ తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

**వీటిలో ప్రతిభ కనబర్చాలి**

- **స్టాండింగ్ బ్రాడ్ జంప్:** బాలురు 36 సెం.మీ, బాలికలు 34 సెం.మీ దూరం దూకాలి.
- **800 మీటర్ల పరుగు:** బాలురు 3.06 నిమిషాల్లో, బాలికలు 3.19 నిమిషాల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి.
- **30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్:** బాలురు 4.4, బాలికలు 4.6 సెకన్లలో నిర్దేశించిన దూరాన్ని చేరుకోవాలి.
- **6, 10 మీటర్ల షటిల్ రన్:** బాలురు 16.4 సెకన్లు, బాలికలు 17.1 సెకన్లలో 10 మీటర్ల దూరాన్ని ఆరు సార్లు పరుగెత్తాలి.
- **వర్టికల్ జంప్:** బాలురు 194 సెం.మీ, బాలికలు 181 సెం.మీ ఎత్తు ఎగరాలి.
- **మెడిసిన్ బాల్ త్రో :** బాలురు 2.77 మీటర్లు, బాలికలు 2.48 మీటర్ల దూరం బంతిని విసరాలి.
- **ఫ్లెక్సిబిలిటీ టెస్ట్:** చిన్నారులను ఓ బల్లపై నిలబెడతారు. వారి చేతులతో వారి పాదాలను తాకాల్సి ఉంటుంది.మోకాళ్లు వంచకుండా ఎంత కిందికి వంగితే అంత ఫ్లెక్సిబిలిటీ ఉన్నట్లు గుర్తిస్తారు.
- స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక మూడు స్థాయిల్లో ఉంటుంది. ఇప్పటికే మండల స్థాయిలో ఎంపిక ప్రక్రియ పూర్తయింది. గురువారం నుంచి జిల్లా స్థాయి ఎంపికలు జరుగనున్నాయి. ఇక్కడ ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయిలో ఈ నెల 27 నుంచి 28 వరకు హకీంపేట్‌లో సెలెక్షన్స్ నిర్వహించనున్నారు.

| సంవత్సరం | విద్యార్థులు |
|---|---|
| 2017 | 05 |
| 2018 | 06 |
| 2019 | 07 |
| 2021 | 07 |
| 2022 | 06 |

**మన జిల్లా నుంచి**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొనసాగిన సమయంలో క్రీడా పాఠశాలల పట్ల విద్యార్థులకు గాని, వారి తల్లిదండ్రులకు గాని అంతగా అవగాహన లేదు. దీంతో క్రీడా నైపుణ్యం ఉన్నా స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కాలేక పోయారు. అయితే ప్రత్యేక జిల్లా ఏర్పడిన తర్వాత యువజన, క్రీడల శాఖ ప్రత్యేక దృష్టిసారించి మారుమూల గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎంపిక విధానాన్ని చేపడుతుంది. దీంతో గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా నుంచి 31 మంది ఎంపికయ్యారు. ఏటా కొంత మంది విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికవుతూ ప్రతిభను కనబరుస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



గ్రామీణ ప్రాంత చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా క్రీడలో నైపుణ్యం ఉంటే వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలి. స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతో పాటు, ఆసక్తి ఉన్న క్రీడల్లో నాణ్యమైన శిక్షణ ఇస్తారు.

– హన్మంత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి



పెద్దేముల్‌లో భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు



బోనమెత్తిన మహిళలు

## వైభవంగా బోనాలు

పెద్దేముల్, నాగులపల్లిలో మంగళవారం మైసమ్మతల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పూలు, వేప కొమ్మలతో మహిళలు బోనాలను అందంగా అలంకరించారు. వీటిలో నైవేద్యాలు పెట్టుకుని, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

– పెద్దేముల్

## క్లుప్తంగా

### ప్రజా సమస్యల పరిష్కారానికే 'మీతో నేను'



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: ప్రజా సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే మీతో నేను అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 18, 20, 29, 30వ వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైపులు లీకేజీ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పాడుబడ్డ ఇండ్లను తొలగించాలని, బావులపై కప్పులు ఏర్పాటు చేయాలన్నారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి కాలనీలను శుభ్రంగా ఉంచాలన్నారు.

### రథోత్సవానికి రండి



ఎమ్మెల్యేకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంఘం నాయకులు

కొడంగల్: పెద్దమ్మ తల్లి రథోత్సవాని(ఫలహారం బండి)కి రావాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం ఆహ్వానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు తెలంగ్‌వాడీలో ఉన్న ముదిరాజ్ భవనం నుంచి ఊరేగింపు ప్రారంభమతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ రావ్ యాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు డి.వెంకటయ్య, రుద్రారం వెంకటయ్య, బాల్‌రాజ్, నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుల్కచర్ల: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న ఘటన చౌడాపూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మన్‌కాల్వ గ్రామంలో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ రాజేందర్‌పై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పురుషోత్తం హెచ్చరించారు.

# యాజమాన్య పద్ధతులు.. అధిక దిగుబడులు



గొల్లగూడ గ్రామంలో వరి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

నవాబుపేట: వానాకాలం వరి సాగులో దిగుబడి పెరగాలంటే యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**నాట్లు వేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.**

- నాట్లు వేసేందుకు వారం నుంచి పది రోజుల ముందే పొలాన్ని సిద్ధం చేసి, 15 సెంటీమీటర్ల లోతులో దమ్ము చేసుకోవాలి.
- దీంతో పిలకలు బాగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.
- వరి నారు తీయడానికి వారం రోజులు ముందుగా కార్బోఫ్యూరాన్ గుళికలు 10 సెంట్ల నారు మడికి కేజీన్నర వేసుకోవాలి.
- నాట్లు వేసే సమయంలో వరి నారు కత్తిరించి నాటాలి. చదరపు మీటరుకు 33 కుదుళ్లు ఉండేలా చూసుకోవాలి.
- నారు ముదిరితే చదరపు మీటరుకు 44 కుదుళ్లు వేసుకుంటే మేలు.
- పచ్చిరొట్ట ఎరువు వేసి దమ్ము చేసే సమయంలో మురుగు నీటిని తీసి వేసి, కొత్త నీటిని పెట్టుకొని నాట్లు వేయాలి.
- ఎకరా వరి పంటకు సింగల్ సూపర్ పాస్పేట్ 150 కిలోలు, యూరియా 78 కిలోలు, పొటాష్ 40 కిలోలు చొప్పున విడతల వారీగా వేసుకోవాలి.
- భాస్వరం మొత్తం ఎరువు, యూరియా 26 కిలోలు, పొటాష్ 20 కిలోలు దమ్ములో వేస్తే పైరు ఏపుగా పెరుగుతుంది.



ప్రసన్నలక్ష్మి

- చివరి అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 26కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకుంటే మేలు.
- పచ్చిరొట్ట ఎరువులు వేసిన వారు రసాయన ఎరువుల మోతాదు తగ్గించాలి.
- రసాయన ఎరువులు వేసేటప్పుడు. నీరు ఎక్కువగా లేకుండా బురద పదునులో వేయాలి.
- వరి నాట్లు వేసిన 5, 6 రోజుల్లో కలుపు మందు పిచికారీ చేసుకుంటే ఉపయోగం.
- ఎకరాకు ఆక్సిడయార్జిల్ 35గ్రాములు, పిట్రిల్లాక్లోర్ 500గ్రాములు (అర లీటరు)లలో ఏదో ఒకటి పిచికారీ చేయాలి.
- కలుపు మందు చల్లిన 24 గంటల వరకు పైరులో నీరు బయటకు పోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులు వచ్చే అవకాశం అధికంగా ఉందని వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు.

### ఆలస్యంగా విత్తు



ధారూరు: కంది విత్తనం వేస్తున్న మహిళలు

ధారూరు: జూన్ నెలలో సరిగ్గా వర్షాలు పడక పోవడంతో రైతులు సకాలంలో విత్తనాలు వేయలేదు. జూలై మాసంలో అనుకున్న మేర వర్షాలు పడుతుండడంతో మిగిలిన రైతులు విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని కొంత మంది రైతులు వ్యవసాయ శాఖ ఉచితంగా సరఫరా చేస్తున్న పీఆర్‌జీ 176 రకం, ఎల్‌ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలను తీసుకెళ్లి సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో దాదాపు 5వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. మరో వెయ్యి మంది రైతులు కంది విత్తనాలు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. జూలై రెండో వారం వరకు కంది విత్తనం వేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

# బస్టాండ్ కల సాకారమయ్యేనా?




కోట్‌పల్లిలోని బస్ షెల్టర్

**రెండు దశాబ్దాల క్రితం బస్ షెల్టర్**
- నేటి జనాభాకు సరిపోని వైనం
- మండల హోదా వచ్చినా తీరని ప్రయాణికుల కష్టాలు
- పట్టించుకోని పాలకులు, ఆర్టీసీ అధికారులు

బంట్వారం: మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. రెండు దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా చిన్న పాటి బస్ షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం మండల జనాభా 22 వేలు. వీరి అవసరాలకు బస్ షెల్టర్ ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న కోట్‌పల్లి మండల కేంద్రంగా ఏర్పడింది. దీంతో దిన దినాభివృద్ధి చెందుతోంది. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు ఏ చిన్న అవసరం పడినా కోట్‌పల్లికి రావాల్సిందే.. అంతేకాకుండా ప్రతి సోమవారం సంత నిర్వహిస్తారు. సంతకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ప్రతి రోజూ కోట్‌పల్లిలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న బస్ షెల్టర్ ప్రయాణికులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో చాలా మంది హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. నిత్యం అసౌకర్యానికి గురవుతున్నారు. అయితే బస్ షెల్టర్ ఎదురుగా ప్రైవేటు వాహనాలు నిలుపుతుండడం, చిరు వ్యాపారులు కూడా తోపుడు బండ్లను అక్కడే పెడుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బస్సులు వస్తే షెల్టర్‌లో కూర్చున్న ప్రయాణికులు త్వరగా వెళ్లలేకపోతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం కోట్‌పల్లికి మండల హోదా కల్పించింది. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ శాఖల అధికారులు ఇక్కడికి వచ్చారు. దీంతో వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రజల రాకపోకలు పెరిగినా బస్టాండ్ నిర్మాణంపై పాలకులు దృష్టి సారించలేదు. దీంతో ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. తాండూరు, వికారాబాద్, సంగారెడ్డి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కోట్‌పల్లికి వచ్చి పోతుంటాయి. ప్రతి రోజూ వందలాది మంది ప్రజలు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోట్‌పల్లికి బస్టాండ్ మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఎరువుల కొరత రాకుండా, సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతుబంధు ద్వారా సాగుకు పెట్టుబడి సాయం చేస్తున్నట్లు వివరించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ యువజన విభాగం చౌడాపూర్ అధ్యక్షుడు మేగ్యానాయక్, రాంరెడ్డిపల్లి సర్పంచ్ సత్యయ్య, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, మొగులయ్య, దామోదర్‌రెడ్డి, అనంతయ్య, పెంటయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

**అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తా**

పరిగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, సత్యాహరిశ్చందర్, జెడ్పీటీసీ హరిప్రియ, మేఘమాల, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- అభివృద్ధి చూసి ఓర్వలేకే ఒక్కటయ్యారు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- రేవంత్ దిష్టిబొమ్మ దహనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో దొరల రాజ్యం పోయిందని, కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడిరాయిచూర్ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన మహిళలు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీలతో పాటు కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గడిచిన 60 ఏళ్లలో అప్పటి ప్రభుత్వాలు కొడంగల్‌ను పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో ఈ ప్రాంత ప్రజలకు తెలియదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నేను ఎమ్మెల్యేగా గెలిచిన ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం పురోగతి వైపు పరుగులు పెడుతోందన్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో నేను చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రేవంత్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డిలు ఒక్కటయ్యారని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు కార్యకర్తలకు అందుబాటులో ఉండలేదన్నారు. నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చేవారని ఆరోపించారు. అందుకే ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. రేవంత్ టీపీసీసీ అధ్యక్షుడు అయిన తర్వాత కార్యకర్తలకు మరింత దూరమయ్యారని అన్నారు. ఇన్నాళ్లు ఒకరిని ఒకరు తిట్టుకున్న రేవంత్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డిలు ఎందుకు కలుస్తున్నారో వారికే తెలియాలన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదని రేవంత్ ప్రకటించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు గంటల విద్యుత్ వ్యవసాయానికి సరిపోతుందని రేవంత్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత కరెంటు, రైతు బీమా, రైతుబంధు, ఆసరా పింఛన్లు,, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 300 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. రేవంత్‌రెడ్డి 9 ఏళ్ల పాటు కొడంగల్ ఎమ్మెల్యేగా ఉండి ఏమి చేశారని ప్రశ్నించారు. 2018లో రేవంత్ గెలిచి ఉంటే అభివృద్ధి జరిగి ఉండేది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని అన్నారు. రైతుల పట్ల వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ కార్యకర్తలు దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచులు గోవింద్, శంకర్, వైస్ ఎంపీపీ రహమతుల్లా, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, నరేష్‌గౌడ్, బాకారం అరుణ్, రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పశువైద్యం.. అందని ద్రాక్షే..!

**మండలం మొత్తానికి ఒకే డాక్టర్**
- సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న జీవాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వ్యాధుల బారిన పడిన మేకలను మల్కాపూర్ పశు వైద్యశాలకు తెచ్చిన రైతులు

తాండూరు రూరల్: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల బారిన పడే గొర్రెలు, మేకలను కాపాడుకునేందుకు కాపరులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. సీజనల్ వ్యాధుల బారిన పడిన జీవాలకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. మండలంలో 33 గ్రామాలు ఉండగా మల్కాపూర్, చెంగోల్ గ్రామాల్లో పశువైద్య శాలలు, జినుగుర్తి, కరన్‌కోట్ గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి. అయితే ఒక్క వైద్యుడే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆస్పత్రి కింద 6నుంచి 8 గ్రామాలు ఉన్నాయి. మండలంలో 14 వేల గొర్రెలు, 16 వేలు మేకలు, 18 వేల ఆవులు, గేదెలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రైతులు పశు సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే మల్కాపూర్ పశువైద్యశాలకు మాత్రమే డాక్టర్ నిజానంద్ ఉన్నారు. చెంగోల్ ఆస్పత్రికి వికారాబాద్‌కు చెందిన వైద్యుడు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. జినుగుర్తి, కరన్‌కోట్ సబ్‌సెంటర్లలో అసిస్టెంట్ వెటర్నరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మల్కాపూర్ డాక్టరే మిగిలిన మూడు సెంటర్ల బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. ఒక్క డాక్టర్ మండలం మొత్తం వైద్యం చేయడం సాధ్యం కాదని రైతులు అంటున్నారు. వ్యాధుల బారిన పడే జీవాలకు అటెండర్లే దిక్కువుతున్నారు.

**ఇబ్బందిగా ఉంది**



మండలంలోని రెండు పశువైద్య కేంద్రాలు, మరో రెండు సబ్ సెంటర్లు ఉన్నాయి. కానీ నేనొక్కడినే విధులు నిర్వహిస్తున్నా. 33 గ్రామాల్లోని జీవాలకు ఒక్కరే వైద్యం చేయడం చాలా కష్టం. ఓ వైపు వైద్యం చేస్తూనే మరో వైపు గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి డీడీలు తీయించి బ్యాంకుల్లో అందజేస్తున్నా. నిత్యం అందుబాటులో ఉండి జీవాలకు వైద్యం చేస్తున్నా.

– నిజానంద్, పశువైద్యాధికారి, మల్కాపూర్

# వీడిన రోడ్డు ప్రమాద మిస్టరీ

**24 గంటల్లో నిందితుడి అరెస్ట్**



పోలీసుల అదుపులో నిందితుడు అన్సారీ

పెద్దేముల్: రెండు రోజుల క్రితం మండలంలోని కందనెల్లి తండా వై జంక్షన్ గోట్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం మిస్టరీని పోలీసుల ఛేదించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వాహన డ్రైవర్ ఆటోను ఢీ కొట్టడంతో అందులోని ప్రణయచారి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకున్న పెద్దేముల్ పోలీసులు వాహనాన్ని, నిందితున్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ధారూర్ మండలం గట్టెపల్లి గ్రామానికి చెందిన ప్రణయచారి తన ఆటోలో తాండూరుకు వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి కర్ణాటక రాష్ట్ర వాహనంగా గుర్తించారు. జహీరాబాద్ ప్రాంతంలో వాహనాన్ని పట్టుకున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అన్సారీని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశారు. 24 గంటల్లో నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

### ఉత్తీర్ణత శాతం పెరిగేలా బోధన ఉండాలి: డీఈఓ రేణుకాదేవి



బోట్యానాయక్ తండాలో విద్యార్థినితో పాఠం చదివిస్తున్న డీఈఓ రేణుకాదేవి

కుల్కచర్ల: మండలంలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందని, ఈ సారీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత శాతం పెరిగేలా బోధన చేయాలని డీఈవో రేణుకాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని కుల్కచర్ల బాలుర, కస్తూర్బా పాఠశాల, బోట్యానాయక్ తండా, ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముజాహిద్‌పూర్, బోట్యానాయక్ తండాలో విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబీబ్ అహ్మద్, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి దేవి, సీఆర్పీలు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

ధారూరు: వివాహిత అదృశ్యమైన సంఘటన ధారూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హరిదాస్‌పల్లికి చెందిన శ్రీశైలం, స్వప్న దంపతులు. శ్రీశైలం ఈ నెల 9న కూలి పని నిమిత్తం వికారాబాద్‌కు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా భార్య కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

దోమ: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాకొండ గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య, అమృత దంపతుల కుమారుడు శివకుమార్(17). గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శివకుమార్ ఇంటర్ మధ్యలో ఆపేసి తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడని తెలిసింది. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# దాడి చేసి.. దోచుకుని

- పని ఉందంటూ వృద్ధురాలిని తీసుకెళ్లిన దుండగుడు
- నిర్మానుష్య ప్రదేశంలోకి వెళ్లగానే రాయితో దాడి
- ఆభరణాలు లాక్కొని పరార్



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ, ఏసీపీ

షాద్‌నగర్‌రూరల్: పని ఉంది రావాలని ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి దాడి చేసి అందిన కాడికి దోచుకెళ్లిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం ..మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామానికి చెందిన రుక్కమ్మ (55) షాద్‌నగర్‌లో అడ్డా కూలీగా పని చేస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం అడ్డాపై పనికోసం నిలబడి ఉంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పని ఉంది రావాలని తన బైక్‌పై రుక్కమ్మను ఎక్కించుకొని వెళ్లాడు. ఎలికట్ట శివారులోని ఓ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను లాక్కున్నాడు. విషయం ఎవరికైనా చెబుతుందనే భయంతో రాయితో వృద్ధురాలిపై దాడి చేశాడు. తల భాగంలో కొట్టడంతో రుక్కమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్పృహ తప్పి పడిపోయింది. చనిపోయిందనుకున్న దుండగుడు అక్కడి నుంచి ఉడాయించాడు. సాయంత్రం స్పృహలోకి వచ్చిన రుక్కమ్మ గాయాలతో నడుచుకుంటూ రోడ్డుపైకి వస్తుండగా దారిన వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రుక్కమ్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుశాలకర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడిపై ఆరా తీశారు. వృద్ధురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.